కథానిక

# గాలిమేడలు

జయంతి శ్రీరామమూర్తి

హోటల్లో కొలిచి పెట్టిన నాలుగు మెతుకులూ నోట్లో వేసుకుని గది తలుపు తీసేనో లేదో "అలాగ గోదావరి గట్టుకుపోయి సిగరెట్టు కాల్చుకు వద్దామా" అన్నారు దేవరాజు.

"అం దానికేం నడవండి ఈ దోమలు చేసే సింహనాదాలేగా యిక్కడమటుకు! నిద్ర పట్టిందా, ఏడిసిందా? మళ్ళీ గోదావరి గాలి పీల్చడానికి ఇంతదూరం పనికట్టుకు వస్తామా" అంటూ లేచేను. దేవరాజు తువ్వాలు పైమీద వేసుకుంటూ "పదండి. ఈవేళ త్రయోదశి. చంద్రుడు కూడా మనకి సాయం వుంటాడు" అని గదితలుపు తాళం వేసేడు. మెట్లు దిగి హోటల్ యజమానితో "ఆలస్యంగా వస్తాం. క్రింది తలుపు తీసివుంచాల"ని చెప్పి వీధిలోకి వచ్చేసేం. మా నోళ్లు ఆ మాటా యీ మాటా ఆడుకొంటూంటే, కాళ్లు గోదావరి గట్టుకు నడిచిపోయేయి. అప్పటికి రాత్రి పదికొట్టేరు. ఏ సిగరెట్టు కొట్టుదగ్గర చిరునవ్వడో మినహాయిస్తే వూరంతా మాటుమణిగిందనే చెప్పాలి. దూరాన లంగరు వేసిన పడవలమీది దీపాలు మిణుకు మిణుకుమంటున్నాయి. ఆకాశంమీది నక్షత్రాలు కొన్ని క్రిందపడి గోదావరిమీద తేలియాడుతున్నట్లు, ఈదరగాలి జోరుగా వీచి రోడ్డుమీది దుమ్ము లేగకొడుతూంది. దేవరాజు నడిచి నడిచి ఒక సిమెంటు బెంచీ కనబడగా దానిమీద శరీరాన్ని జారవిడిచాడు తనది కానట్లు. నేనూ ఆయన ప్రక్కనే వొరిగాను. హోటలు భోజనం జీర్ణమయిపోయిందేమో ఆకలిగానూ, నీరసంగానూ వుంది. దేవరాజు సిగరెట్టు ముట్టించి దమ్ముమీద దమ్ములాగుతూ చిటికెలు వేస్తున్నాడు. పైన చంద్రుడు చుట్టూ గిరిగీసుకుని గూట్లో సాలీడులావున్నాడు. దేవరాజు సిగరెట్టు ఆరిపేసి, వెనక్కి జేర్లపడి,

"ఆ చంద్రుడు ఎంత అందంగా వున్నాడో చూసేరూ ఈవేళ" అన్నాడు.

"ఉంటాడు. అందంగా వుండడంకన్న ఆయనకింక వేరే పనిలేదేమో" అన్నాను నేను నా మాటలు వినిపించేయో, లేదో.

"చంద్రుడు శృంగార పురుషుడు. చూసిన వాళ్ళకి సులభంగా మత్తెక్కించేస్తాడు. ఏమంటారు" అన్నాడు దేవరాజు.

"ఏమంటాను? ఏమనగలను?"

"అయితే మీరెప్పుడేనా, యెవరినేనా ప్రేమించేరా..." దేవరాజు.

"మా అమ్మా, నాన్నా..."—నా మాట కడ్డంవచ్చి—

"అదికాదు నేనడిగేది. ఏ స్త్రీరత్నమైనా మీ హృదయపులోతు కనుక్కుందా యింతవరకూ" అన్నాడాయన మళ్ళీ.

"లే" దన్నాను సిగ్గుపడుతూ.

దేవరాజు సిగరెట్టు పొగ జోరుగా వదులుతూ అన్నాడు, "అయితే మీరాఫీల్డులో అజ్ఞానులన్నమాట!"

ఏమనాలో నాకేం తోచలేదు. ఆ విషయాన్ని మార్చడానికీ నా మనస్సు అంగీకరించడంలేదు. బహుశా ఆ ప్రదేశం, ఆ సమయం అలాంటి వనుకుంటాను. "మరయితే మీ సంగతో" అన్నాను ధైర్యంతో.

దేవరాజు వస్తూన్న నవ్వుని బుగ్గలలోనే అణచిపెట్టి "నా విషయం కదపడం మీకు భావ్యం కాదు. అదంతా ఒక తేనెపట్టులాంటి గాథ" అన్నాడు.

ఆయన అలాగంటే తప్పకుండా తెలుసుకోవాలని కుతూహలం కలిగింది నాకు.

"అయినా చెప్పక తప్పదు, మళ్ళీ మనమీ

జీవితంలో కలుసుకుంటామో లేదో. ఎక్కడ కర్నూలు ఎక్కడ బెంగుళూరు?" అన్నాను.

"మరి అయితే వినండి. అంతగా అడిగేరు గనుక చెబుతున్నా. కాని విన్న సంగతులు విన్నట్లే మరచిపోవాలిసుమా" అన్నాడు దేవరాజు చూపుడువేలు నిటారుగా పెట్టి.

"నాకంతమాత్రం తెలియదనుకున్నారా" అన్నాను మళ్ళీ.

దేవరాజు తన బనీను జేబులో దాచిన చిన్న వస్తువు పైకి తీసేడు. అదేదో ఫ్రేముకట్టిన చిన్న ఫోటోలా వుంది. దాన్ని చూపిస్తూ, "ఇదిగో దీనిని చూడండి ప్రళయంగా మారిపోయిన నాప్రణయగాథకి తుది చిహ్నంయిదే. నా జీవితంలోని మధురస్మృతులన్నీ ఇందులోనే వున్నాయి" అన్నాడు.

ఆ ఫోటోలో వున్న ఆవిడ ఎంత అందంగా వుందో అని నా కళ్ళు తహతహలాడేయి. వెంటనే అందుకుని చూసేను. కాని, అందులో ఫోటో యేదీలేదు. అద్దం క్రింద తెల్లకాగితం మాత్రం వుంది. ఏమీ బోధపడక నాకళ్ళు ప్రశ్నార్థకంగా చూచేయి. దేవరాజు ప్రారంభించేడు—

"అది అయిదు సంవత్సరాల క్రిందటి మాట. నవయవ్వనం ఆవిర్భవిస్తూంటే నా మనస్సు పచ్చిపచ్చిగా వుండేది. అప్పుడే చదువు పూర్తి చేసుకొని మా మేనమామ గారింటికి వెళ్లేను. ఆదెక్కడుందనుకున్నారు?- మహాబలేశ్వర్‌లో. ఆ వూరెక్కడిదో తెలుసా సతారా జిల్లాలో—అంటే బొంబాయి రాష్ట్రంలో."

"ఆ తర్వాత" అన్నాను ఇంకా బొంబాయి రాష్ట్రం ఇండియా దేశంలోనూ ఇండియా ఆసియా ఖండంలోనూ వుందని చెబుతాడేమోనని. ఆయన నా వుద్దేశం గ్రహించి,

"ఆ వూరు ఎంతో అందంగా వుంటుంది కొండమీద. వేసం కాలంలో మట్ట మధ్యాహ్నం కూడా చలివేస్తుంది. అందుకే యెంతో మంది ఆ చల్లదనం అనుభవించడానికి వస్తారక్కడికి వేసవిలో."

"మీ మామయ్యగారేం జేస్తున్నారక్కడ?" అన్నాను పురవర్ణన తగ్గించాలని.

"అక్కడ యింజనీరుగా వున్నారు. అదే సమయంలో చల్లదనం కోసం ఓ తెలుగువాళ్ళ కుటుంబం వచ్చిందక్కడికి. వాళ్ళది విశాఖపట్టణం. ఆయనపేరు వామనరావు. ఆయనా, భార్యా, కుమార్తె ముగ్గురు వచ్చేరు. వాళ్ళు మా వీథిలోనే నాలుగిళ్ళ ఆవతల వుండేవారు. ఒకరోజు ఉదయం మా మేడ బాల్కనీలో నిలబడి చూస్తున్నా. ఆ తెలుగువాళ్ళ మేడ బాల్కనీ అక్కడికి బాగా కనబడుతుంది. ఆపైన అప్పుడే పైకి వస్తున్న సూర్యకిరణాలు పడి మెరుస్తూంది. ఆ క్షణంలోనే ఒక నవయువతి బట్టలు ఆరవెయ్యడానికి వచ్చిందక్కడికి. పద్ధెనిమిదేళ్లుంటాయి నవ్వితే నవరత్నాలొలికే పలువరుస. చెంపకు చారెడేసి కళ్లు. ఆహా ఏమి సౌందర్యం! మన తెలుగునాట ఇంతటి సౌందర్యవతు లున్నారని నాకంతకు ముందు తెలియదు. ఆవిడను పోల్చడానికి ఎందరెందరో సినీమా తారలని తలుచుకున్నాను. కాని వాళ్ళందరూ ఎలక్ట్రిక్ దీపం ముందు ఇలాయి బుడ్లలాగే కనుపించేరు నా మనోవీథిలో."

దేవరాజుగారి పరధ్యానాన్ని గుర్తించి "మరి ఆవిడ మీకేసి చూడలేదా" అన్నాను, ఆయన మళ్ళీ అందుకున్నాడు.

"చూసింది. చూసీ చూడనట్టు నటించింది కొంతసేపు. ప్రక్కవాటుగా చూసి, మొహం తిప్పేసుకుంది ఒకసారి. ఆ తర్వాత ధైర్యంగా చూసింది-అదే నాటకానికి నాంది. ఆ తర్వాత వామనరావే మా మామయ్యదగ్గరకు వచ్చేరు-ఎంతైనా తెలుగు కుటుంబం మాదొకటేగా వాళ్ళకి తోడు? దానితో వాళ్లకీ మాకూ రాకపోకలు ప్రారంభమయ్యేయి. సునంద నాతో చనువుగా మాట్లాడుతుండేది. ఒకొక్క రోజు మా యింట్లోనే భోజనం చేసేది. ఇద్దరం కలిసి సాయంత్రం షికారు వెళ్ళి అర్ధరుసీటు పాయంటువద్ద కూర్చునేవాళ్లం. ఇలా వుండగా మా యిద్దరి మధ్యా పెట్టని గోడలాగ ఒక విగ్రహం వచ్చిపడింది. సునంద అక్కగారట. ఆవిడ భర్త ప్లీడరట. ఆవిడకి ఒక కొడుకు కూడాను. తండ్రి వుత్తరం రాస్తేనే వచ్చిందనుకోండి. వచ్చింది వచ్చినట్లు

పడివుండవచ్చునే? మా యిద్దరిమధ్యా సి ఐ డి. లాగ తయారయింది. మేం ఎక్కడికెళ్ళినా మాతోనే వచ్చేది. మేం ఒకళ్ళ కళ్ళల్లోకి ఒకళ్ళు చూసి నవ్వుకున్నప్పుడు తానూ నవ్వేది. దానితో నా ఒళ్లు చల్లబడిపోయేది. నేను సునందతో ఏకాంతంగా మాట్లాడాలని తహతహలాడిపోయేవాడిని కాని అది సాధ్యమయ్యేదెలా?

రోజులు గడుస్తున్న కొద్దీ నేనావిడను లెక్కచేసేవాడిని కాను. సునందతో ఆవిడ యెదుటనే మనోభావాలు వ్యంగ్యంగా చిత్రించేవాడిని. కాని, ఆవిడ నాకేసి నిశితంగా ఘాటుగా చూసేది. ఆ చూపులో ఏవో సందేహాలుండేవి. కాఠిన్యమూ, దండనా వుండేవి. దానితో తగ్గిపోయేవాడిని, ఆవిడ మమ్మల్ని వదల దలుచుకోలేదు. నీడలా వెన్నంటేది. ఒకసారి "పంచగని" వెళ్ళి మూడురోజులున్నాం ముగ్గురమూ. సునంద అక్కయ్య అడ్డుండడంవల్ల ఎంత యమయాతన అనుభవించిందో! చెరువులో బోటింగు చేస్తున్నప్పుడు, హోటల్లో టీ త్రాగుతున్నప్పుడు, ఆఖరికి సినీమా చూస్తున్నప్పుడు ఆవిడ మా యిద్దరి మధ్యా కూర్చునేది. ఆవిడకంత సభ్యత లేదెందుచేతనో? మళ్ళీ చదువులేనిదేమో అంటే, ఇంటర్మీడియెట్ ప్యాసయిందట. తానూ తన రోజుల్లో ప్రియునితో సలిపిన సరస సల్లాపాలూ, ఏకాంతపు ఘడియలూ తలచుకొని అయినా మాకు దూరదూరంగా వుండవలసింది ఇంతకీ ఆవిడ వుద్దేశం ఏమిటో? మా మాటల మధ్య అడ్డం వచ్చేది. ఆకళ్లు చూస్తే నాకు భయంకూడా కలిగేది. వెళ్ళి ఉన్నవీ, లేనివీ తండ్రితో చెప్పదు గదా, ఆయన మామీద విరుచుకుపడడు గదా అని. పాపం, సునంద మెత్తనిమనిషి. అక్కయ్యను ధిక్కరించడం ఆమెకు తెలియదు.

తిరిగి మహాబలేశ్వర్ వచ్చేసేం, ముగ్గురం కలిసి. ఆ చుట్టుప్రక్కల చూడవలసిన స్థలాలన్నీ చూసేము. సునందకూ నాకూ మనస్సులు ఏకమయిపోయినట్లే కాని మా భావాలు మాత్రం వ్యక్తపరచుకొందుకు అవకాశం చిక్కలేదు. దాన్నిబట్టి మీరే గ్రహించుకోండి ఆ గ్రహం మమ్మల్ని ఎంతగా వెన్నంటి వేధించిందో—ఇలా వుండగా ఒకరోజు వచ్చింది. ఎన్నిరోజులు గడవలేదంటారేమో? నా జీవితంలో అలాంటి దినం ఎన్నడూ గడవలేదు. ముందు గడవబోదు. ఆ మరునాడు వామనరావుగారి కుటుంబం తిరిగి విశాఖపట్టణం వెళ్ళిపోతున్నారని తెలిసింది. ఏమీ తోచక విచారంగా సావిట్లో పడక కుర్చీలో వ్రాలేను. ఇంతలో పోస్టువాడు ఉత్తరం ఒకటి తెచ్చి పడేశాడు. అదే యీ వుత్తరం-ఇలాగ మడిచి, ఫ్రేముకట్టి దాచుకొంటున్నాను" అన్నారు దేవరాజు చూపులు శూన్యంలోకి పెట్టి. నా రక్తం ద్విగుణీకృత వేగంతో ప్రవహిస్తూంది. ఉద్వేగం ఆపుకోలేక "ఏముంది దానిలో" అన్నాను. దేవరాజు మళ్ళీ తెలివి తెచ్చుకొని ఇలా అన్నారు. "ఉండవలసిందే వుంది. తన కోరిక సువర్ణాక్షరాలతో చిత్రించింది. ఆ రాత్రి పదకొండు గంటలకి వాళ్ళవీధి చావడిలో కలుసుకొమ్మని ఆ అక్షరాలు చూడగానే నాకళ్లు ఆనందంతో పొరలు క్రమ్మేయి. నాతల దిమ్మెక్కింది. వెంటనే ఉత్తరం మడిచి పెట్టెలో బట్టల అడుగున దాచేసేను. నాకేం తోచడంలేదు. ఎప్పుడు రాత్రి పదకొండుగంటలవుతుందా అని ఒకటే తహతహ. పుస్తకం తీసి నాలుగుపంక్తులు చదవబోయేను. అబ్బా! నడవందే! పడుకుంటే నిద్రపట్టదు. మా అత్తయ్య పెట్టిన టిఫిను జ్వరం నోటికి పరమాన్నం అందించినట్టుంది ఏమీ తోచక షికారు బయలుదేరేను. సునంద మాత్రం బయటకు రాలేదు. బహుశా, ఆ మరునాటి ప్రయాణానికి సామాను సర్దుకుంటూ వుంటుంది—కాదు, కాదు మా మధుర మేళనానికి క్షణాలు లెక్కపెట్టుకుంటూ వుండాలి.

చీకటి పడగానే యింటికి వచ్చేను. పరధ్యాన్నంగా నాలుగు మెతుకులు కొరికి, నిద్ర వచ్చేవాడిలా మంచమెక్కేను. లైటార్పేసి రగ్గు కప్పుకున్నాను ఎనిమిదింటికే. కాని, నిద్ర పడుతుందా ఏడుస్తుందా! నాలో రణరంగం సాగుతోంది. "అయ్యో! వాళ్ళ నాన్నగారు పట్టుకుంటే ఏమవుతుందో, మా మయ్యకు తెలిస్తే ఏం జేస్తాడో? అయినా సునందకి

ఇంత డొంకతిరుగుడెందుకు? తనా యీడువచ్చిన పిల్ల. అవివాహిత, చదువు కుంది. తిన్నగా తండ్రితో చెప్పేస్తే ఆయన మాత్రం ఏమంటాడు? ఏమో పాపం, అలా చెబితే ఆవిడకేం బాధలున్నాయో? ఇంతకీ ఆమె మాట చెల్లనిస్తారో లేదో ఆ ముసలాళ్ళు? అక్కయ్య తీరు చూడనే చూసేగా? ఆరంభం, ఆ రాద్ధాంతం వగైరాల్ని తప్పించుకోడానికే నన్ను సంప్ర దించాలని పిలిచి వుంటుంది. ఈ మాత్రం అర్థం చేసుకోలేక అపోహలో పడుతున్నానే నా తెలివి తెల్లవార! ఇలాగ ఆలోచిస్తుంటే పది న్నర అయింది మా యింట్లో అందరూ నిద్ర పోయారు. గోడ గడియారపు టిక్కు టిక్కు తప్ప వేరే శబ్దమే లేదు మెల్లగా పిల్లిలా నడిచి వీధిలో పడ్డాను తలుపు తాళం వేసి. వీధంతా మాటుమణిగిపోయింది చలిదేవుడు తన ప్రభా వాన్ని చూపిస్తున్నాడు. ప్రక్కయింటి పార్సీ దంపతులు చెయ్యీ చెయ్యీ పట్టుకుని రోడ్డు మీద నడుస్తున్నారు ప్రపంచంలో వీళ్లతో సమానులైన అదృష్టవంతులే లేనట్లు తోచింది. మెల్లగా వామనరావుగారి యిల్లు సమీపించేను. వీధి తలుపు వెయ్యబడివున్నా కిటికీ తెరచేవుంది సావిట్లో నీలిదీపం వెలుగుతోంది కిటికీలోంచి తొంగి చూసేను. ఏం చెప్పను? పట్టాలు తప్పిన రైలింజనులాగ తిన్నగా, రోడ్డు ప్రక్కగా చూసుకుపోయాను. అర ఫర్లాంగు నడిచేకగాని చూసిన దృశ్యాన్ని పునఃస్మరణ చేసుకోలేదు. ఆ సావిట్లో సునంద లేదు. ఆమె అక్కగారు పడక కుర్చీలో వ్రాలి పేపరు చదువుతోంది. చేతి గడియారం చూస్తే పావుతక్కువ పదకొం డయింది ఆహా! తొందరపడి పిలువలేదు నయ మయింది. సునంద పదకొండు గంటలకు గదా రమ్మన్నది! అనుకుంటూ ఇంటిదారి బట్టేను.

ప్రక్కమీద పడుకున్నానన్నమాటేగాని నన్ను ఏవేవో తలపులు నల్లులకన్న క్రూరంగా కరుస్తున్నాయి. ఏ ప్రక్కకి ఒత్తిగిల్లినా సూదుల మయంగానే తోచింది నా పరుపు. లోపల పుట్టిన కోరికల వేడికి హృదయం కరిగిపోతున్న ట్లుయింది. ఇంతకీ ఏమిటాలోచిస్తున్నానో నాకే తెలియలేదు. మళ్లీ లేచిలైటు. చూస్తే పదకొం డున్నర అయింది. ఖంగారుగా ఇందాక టిలాగే వామనరావుగారి వీధిచావడి సమీపిం చేను. అదే కిటికీలోంచి తొంగి చూసేను. కాని యేం చెప్పను? సునంద లేదు. మళ్ళీ వాళ్ళ అక్కయ్యే స్వెట్టర్లల్లుకుంటూంది. నా గుండె జారి పోయినట్లయింది. కొంపతీసి చెల్లెలి వుత్తరం సంగతి ఆమెకు తెలియలేదుగదా? తిరిగి తిన్నగా యింటికి వెళ్లిపోయేను. నీరసం వచ్చి మంచం మీద వ్రాలిపోయేను. ఏం చెయ్యాలో ఆలో చించి నిశ్చయించే శక్తి నా మెదడులో మిగల లేదు. ఆఖరికి విధి యిలాగ మా యిద్దరినీ విడ దీస్తుందనీ ఎన్నడూ అనుకోలేదు

"పోనీ ఆ రాత్రే యింకో సారి వెళ్ళి చూడ లేకపోయారూ?" అన్నాను. దేవరాజు వెర్రిగా నవ్వుతూ చెప్పేరు.

"ఒకసారేమిటి బాబూ! రెండుసార్లు మళ్లీ వెళ్ళి చూసేను. ఒంటిగంటకొకసారీ, మూడు గంటలకింకో సారీ వెళ్ళేను. కాని యేం లాభం ఇంద్రజాలంలాగ ఆ భూతమే కుర్చీలో కునికి పాట్లు పడుతూ కూర్చుంది. నిస్సందేహంగా మమ్మల్ని పట్టుకుని తండ్రికి వప్పజెప్పాలనే ఆమె వుద్దేశం. మార్గాంతరం లేక మూడుంపా వుకి వచ్చి మంచంమీద పడ్డాను.

ప్రొద్దున్నే కొంచెం ఆలస్యంగా లేచేను. దంతధావనం చేసి యింట్లో అడుగుపెట్టేసరికి గడి యారం ఎనిమిది కొట్టింది. మొదటి బస్సు జ్ఞాపకం వచ్చింది వెంటనే బట్టలు మార్చుకుని పరు గెత్తేను బస్సుస్టాండుకి. అప్పటికే హారను కొడుతున్నారు. వామనరావుగారి కుటుంబం అక్కడనుంచి రవానా అయిపోతూంది. సునంద చిరునవ్వుతో నమస్కారం చేసి "రండి సమ యానికి వచ్చేరు-మీ మాటే అనుకుంటున్నాం" అంది, ఇంతలో బస్సు కదిలింది. "మరచి పోకండేం" అంది ఆవిడ అక్కయ్య.

"నిన్ను నా జీవితంలో మరవాలన్నా వీలవు తుందా రాక్షసీ" అన్నాను కాని నా మాటలు ఆ బస్సు గొడవలో ఆమెకు వినిపించి వుండవు. వాళ్ళంతా కనుమాపుమేర దాటిపోయే వరకూ అక్కడనుంచి ఒక్క అడుగైనా కదల్లేదు నేను. ఇంతకీ సునంద వెళ్ళిపోయింది. వెనక దారి పట్టేను. అప్పటినుంచీ నా బ్రతుకులో, ఈ నా బ్రతుకులో తిరోగమనమే గాని పురో

గమనంలేదు" అంటూ దేవరాజు గోదావరికేసి చూస్తున్నారు.

"పోనీ మీరైనా ధైర్యంగా మీ మామయ్య గారికి చెప్పి సునందతో మీ పెళ్ళి ఏర్పాటు చేసుకోలేక పోయారూ?" అన్నాను నా సందేహము తీరక. దేవరాజు మళ్ళీ ఇలా అన్నారు:

"ఏం చెప్పమన్నారుబాబూ! వామనరావు గారు విశాఖపట్నం వెళ్ళిన వారం రోజులకే మా మామయ్యపేర శుభలేఖ వచ్చింది. అందులో సునంద పెళ్లి ఆ వూళ్ళోనే ఒక ప్రొఫెసరు గారితో జరగబోతున్నట్లువుంది. అదే నా పాలిటి బ్రహ్మాస్త్రం. చూడండి స్త్రీ చిత్తం నీటి బిందువు- ఎవరో అన్నట్లు అది అమృతంగానూ మారగలదు-విషంగానూ మారగలదు" ప్రణయగాథ ముగించి దేవరాజు మళ్ళీ సిగరెట్టు వెలిగించేరు. దూరాన గంటస్తంభం మూడు కొట్టింది. నేనాయన చేతిలోని ఫ్రేము నందుకొని "అయితే దేవరాజుగారూ! మీరహస్యాలన్నీ నాతో చెప్పేసేరుగదా! ఇంక దీన్లో వున్నది కూడా చూడనిస్తారా?" అన్నాను:

ఆయన సంకోచిస్తూ ఇలాగన్నాడు.

"ఏం చెప్పను? ఇంతవరకూ ఈ వుత్తరం సునందకంటూ, నాకంటూ తప్ప మూడో కంట బడియెరుగదు. అయినా మీకూ నాకూ కలిసిన స్నేహానుబంధంవల్ల మీకు చూపించడానికి నాకెట్టి అభ్యంతరమూ లేదు. కాని అత్యంత రహస్యంగా వుంచాలిసుమండి"

"నా కామాత్రం చెప్పాలా బాబూ" అన్నాను- నేను దేవరాజు నాకు పైకితీసి, ఆ ఫ్రేములో మేకులు పీకడం మొదలు పెట్టేడు. "అయిదేళ్ళ క్రితం కొట్టిన మేకులు వీటి తస్సాదియ్యా! తుప్పుపట్టి ఎలా బిర్ర బిగిసిపోయాయో! వీటికికూడా నేనంటే లోకువే కామోసు" అని బలంగా పీకేసేరు. అందులోని కాగితం అందుకున్నాను. నిజంగా దానిలో ఏదో రాసివుంది. మునిసిపాలిటీ దీపపు గుడ్డి వెలుగులో ఇలా చదువుకున్నాను:

"రేపు మొదటిబస్సులో మేం వెళ్లిపోతున్నాం. మీరు ఈ రాత్రి పదకొండు గంటలకు వచ్చి మా వీధి చావడిలో నన్ను కలుసుకోవలెను. నేనెందుకు రమ్మంటున్నానో మీరూహించుకోగలరని తలుస్తున్నాను. మరువవద్దు - సరిగా పదకొండు గంటలకు-"

ఉత్తరం మూసి ఒకసారి గోదావరికేసి చూసేను. భావం నాకు సరిగా బోధపడినట్లు లేదు. మళ్ళీ ఒకసారి చదివేను. కాని, ఈసారి ఏవో అక్షరాలమీద నా దృక్కులు చిక్కుపడ్డాయి. ఆ మునిసిపాలిటీ గుడ్డిదీపం నన్ను మోసం చేస్తున్నట్లయింది. అగ్గిపుల్లగీసి చూసేను. ఒక్కసారిగా నారక్తం ఉప్పొంగి సముద్ర కెరటంలాగ నా మొహాన్ని కొట్టింది. దేవరాజు కేసి చూస్తే ఆయన నిస్పృహతో సిగరెట్టుపొగ చక్రంలా విడుస్తున్నాడు. ఉద్వేగంతో అన్నాను-

"మీరు ప్రేమించినావిడ పేరేమిటన్నారు."

"సునంద."

నిట్టూర్చేను, "అయితే ఈ వాక్యాల క్రింద 'సుమిత్ర' అని వుందే అంటూ.

దేవరాజు త్రుళ్ళిపడి "ఏమిటి" అన్నాడు అగ్గిపుల్ల గీసి.

నిజంగా "సుమిత్ర" అనే వుంది. దీర్ఘంగా నిట్టూర్చాడు దేవరాజు.

నేనే ఇలాగ అడిగేను:

"మరి సుమిత్ర యెవరు?"

"వాళ్ల అ...క్క...య్య"—గంటస్తంభం నాలుగు కొట్టింది. దేవరాజు లేచి నిలబడి "అన్నట్లు మరచిపోయాను. నేనీ నాలుగున్నర బండిలో వెళ్ళిపోవాలి" అన్నాడు. ఇద్దరం హోటలువైపు దారితీసేం. దారిలో బాగుండదని పలకరించేను.

"ఇంతకీ సుమిత్ర మీకట్లా ఎందుకు వ్రాసినట్లు—"

"నన్ను ఇన్నిదినాలు ఏడిపించేందుకు"— ఇది నా ప్రశ్నకు జవాబు కాకపోయినా వూరుకున్నాను.

గబగబా గదితలుపు తాళంతీసి సామాను జట్కాలో పెట్టుకొని బండివానికి సైగచేసేడు దేవరాజు. నేనల్లాగా నిర్ఘాంతపోయి నిలుచున్నా. ఆబండి పోతూంటే ఏదో కాలరథం నడుస్తూ దారిలో గాలిమేడలు ఎన్నిటినో కూల్చుకొనిపోతూన్నట్లే కనిపించింది. అందులో దేవరాజు కట్టుకున్న వొకటి బహుశా!